ఊరు కోసం పోరు

- ప్రత్యేక పంచాయతీ చేయాలంటున్న వెంకాయమ్మపేట గ్రామస్తులు
- పరిష్కారం కాని సమస్యలతో సతమతం
- ఉనికి కోల్పోతున్నామంటూ ఆవేదన
- జేఏసీ ఆధ్వర్యంలో పోరాటం



వెంకాయమ్మపేటను ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్న గ్రామస్తులు, జేఏసీ నాయకులు

కడియం: తమ గ్రామం అన్ని విధిలా వెనుకబడడమే కాకుండా, ఉనికే లేకుండా పోతోందని కడియపులంక పంచాయతీ పరిధిలోని వెంకాయమ్మపేట గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ గ్రామాన్ని ప్రత్యేక పంచాయతీగా చేయాలంటూ వారు డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే వారు ఆందోళన బాట కూడా పట్టారు. ఈ సందర్భంగా వివిధ రాజకీయ పార్టీల నుంచి ఏర్పడిన జేఏసీ ఆధ్వర్యంలో వెంకాయమ్మ గ్రామస్తులు పోరాటాన్ని ముందుకు తీసుకువెళుతున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, జేఏసీ నాయకులు తమ గ్రామం ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఏకరవుపెడుతున్నారు.

పట్టించుకునే వారే కరవు

కడియం మండలంలో అతి పెద్ద పంచాయతీల్లో ఒకటిగా ఉన్న కడియపులంక పరిధిలోని వెంకాయమ్మపేట ఇబ్బందులను పట్టించుకునేవారే కరవయ్యారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్లు, డ్రైనేజీలు, వీధిలైట్లు తదితర సమస్యలతో గ్రామం అధ్వానంగా మారిందంటున్నారు. ఈ గ్రామానికి వచ్చే మెయిన్ రోడ్డు నిర్మాణం 14 ఏళ్లుగా న్యాయపరమైన చిక్కులతో పెండింగ్‌లో ఉండిపోయిందంటే ప్రజాప్రతినిధుల శ్రద్ధ ఏపాటిదో అవగతమవుతోందని చెబుతున్నారు. తమకు ప్రత్యేక పంచాయతీ లేకపోవడమే ఇంతటి నిర్లక్ష్యానికి కారణంగా భావిస్తున్నామని గ్రామస్తులు స్పష్టం చేస్తున్నారు. పంచాయతీ కార్యాలయానికి దాదాపు నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న తమ ఊరి ప్రధాన రహదారి వెంబడి కనీసం వీధిలైట్లు కూడా లేవంటున్నారు. గ్రామంలో రెండు దశాబ్దాలు దాటిన సీసీ రోడ్లు పది వరకు ఉన్నాయన్నారు. శిథిల స్థితికి చేరిన ఈ రోడ్లు పూర్తిగా ముంపునకు గురవుతున్నాయన్నారు. వర్షం వస్తే రోడ్లన్నీ బురదమయంగా మారుతున్నాయని అంటున్నారు. దాదాపు 1.20 లక్షల లీటర్ల వాటర్ ట్యాంక్ నిరుపయోగంగా మారిందని విచారం వ్యక్తం చేస్తున్నారు. మండలమంతా గోదావరి జలాలు అందుతున్నప్పటికీ, వెంకాయమ్మపేట వాసులకు మాత్రం ఆ భాగ్యం లేదని మథనపడుతున్నారు. పంచాయతీ పారిశుధ్య కార్మికులు నెలకు రెండు సార్లు మాత్రమే గ్రామానికి వస్తున్నారని, అది కూడా మెయిన్ రోడ్డు మాత్రమే శుభ్రం చేస్తున్నారని, వీధుల్లోకి రావడం లేదని చెబుతున్నారు. వీధిలైటు పాడైపోతే బాగు చేసేందుకు నెలల తరబడి జాప్యం చేస్తున్నారని మండిపడుతున్నారు. వెంకాయమ్మపేటకు శ్మశాన వాటిక కూడా లేదంటున్నారు. వెంకాయమ్మపేట అనే గ్రామమే లేన్నట్టుగా ప్రభుత్వ యంత్రాంగం వ్యవహరిస్తోందని ఆరోపించారు. వెంకటసూర్య థియేటర్ ఎదురుగా ఉన్న వీధుల్లోనూ ఇదే పరిస్థితి నెలకొందన్నారు.

అన్ని విధాలా నష్టపోతున్నాం

కడియపులంక పంచాయతీ పరిధిలో ఉండడంతో గ్రామం అన్ని విధాలా నష్టపోతుంది. కనీసం మౌలిక సదుపాయాలకూ ఏళ్ల తరబడి వేచిచూడాల్సి వస్తుంది. కనీసం వీధిలైట్లు కావాలని మొరపెట్టుకున్నా నెలల తరబడి జాప్యం జరుగుతుంది. దీంతో గ్రామస్తులంతా ప్రత్యేక పంచాయతీ కావాలని కోరుకుంటున్నారు.

– కుసుమే వెంకటరావు, వెంకాయమ్మపేట

ఏళ్ల తరబడి పోరాటం

వెంకాయమ్మపేట గ్రామాన్ని ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేయాలని గ్రామస్తులు ఏళ్ల తరబడి పోరాడుతున్నారు. దాదాపు 2,500 మంది ఓటర్లు ఉన్న ఈ గ్రామాన్ని రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నాటికి ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేయాలి.

– అయితరెడ్డి గంగాధర్, వెంకాయమ్మపేట

1994 నుంచే పోరాటం

తమ గ్రామానికి జరుగుతున్న అన్యాయంపై 1994 నుంచే పోరాటం జరుగుతోందని, వివిధ కారణాలతో ఈ ప్రయత్నాలు నీరుగారినట్టు గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు. నానాటికీ గ్రామంలో జనాభా పెరుగుతోందని, సౌకర్యాలు మాత్రం మెరుగుపడడం లేదంటున్నారు. ప్రత్యేక పంచాయతీగా లేకపోవడమే దీనికి కారణమని విశ్లేషిస్తున్నారు. ప్రస్తుతం గ్రామ పరిధిలో 1,322 మంది ఓటర్లు ఉన్నారు. గ్రామంలో నివసిస్తూ, బుర్రిలంక పరిధిలో 150 మంది, దోసాలమ్మకాలనీ పరిధిలో 80 మంది, కడియం గ్రామ పరిధిలో 70 మంది వరకు ఓటర్లున్నారు. వీరందరికీ వెంకాయమ్మపేట పరిధిలోని ఓటరు జాబితాల్లో చేరిస్తే దాదాపు 2,500 మంది వరకు ఓటర్లు ఉంటారని గ్రామస్తులు చెబుతున్నారు. 500 మంది జనాభా దాటితే పంచాయతీగా ఏర్పాటు చేసేందుకు నిబంధనలు ఉన్నాయని గుర్తు చేస్తున్నారు. అలాగే ప్రధాన పంచాయతీ కార్యాలయానికి మూడు కిలోమీటర్లు పరిధి దాటి ఉంటే కూడా ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేయవచ్చని నిబంధనలు చెబుతున్నాయంటున్నారు. ఈ నేపథ్యంలో వెంకాయమయ్యపేటను ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేయాలని కోరుతున్నామని గ్రామస్తులు, జేఏసీ నాయకులు స్పష్టం చేస్తున్నారు.

క్లుప్తంగా

ప్రధాన కార్యదర్శి దృష్టికి ఉద్యోగుల సమస్యలు



ప్రధాన కార్యదర్శితో మాట్లాడుతున్న ఉద్యోగ సంఘ నాయకులు

కడియం: వైద్య, ఆరోగ్య శాఖ ఉద్యోగులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఆ శాఖ ప్రధాన కార్యదర్శి గౌరవ్‌సార్‌కు విన్నవించినట్టు ఏపీజీఈఏ జిల్లా కార్యదర్శి సీహెచ్ విల్సన్‌పాల్ ఇక్కడి విలేకరులకు వెల్లడించారు. తాడేపల్లిలోని ఆయన ఛాంబర్‌లో సంఘ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కేఆర్ సూర్యనారాయణ, ఎం.రమేష్‌కుమార్ తదితరులతో మంగళవారం కలిసినట్టు చెప్పారు. జీవో 143ని రద్దు చేయాలని, పని ఒత్తిడి తగ్గించాలని, ప్రమోషన్లు కల్పించాలని, ఉద్యోగ నియామకాలు చేపట్టాలని, తొలగించిన పురుష హెల్త్ అసిస్టెంట్లను విధుల్లోకి తీసుకోవాలని, ఎఫ్ఆర్ఎస్ విధానం రద్దు చేయాలని తదితర సమస్యలను ఆయన దృష్టికి తెచ్చామన్నారు. సంఘ జిల్లా నాయకులు వై.మోహనరావు, కె.మల్లిబాబు, రాజశేఖర్, మందులాదేవి తదితరులు పాల్గొన్నారన్నారు.

'పలుకు'లో ప్రపంచ బధిరుల దినోత్సవం



కిట్లు అందుకున్న చిన్నారులతో అతిథులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): సంకల్పం సర్వీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో స్థానిక స్వరాజ్య నగర్‌లో నిర్వహిస్తున్న పలుకు బధిరుల ఆశ్రమ ప్రత్యేక విద్యా సంస్థలో మంగళవారం ప్రపంచ బధిరుల దినోత్సవం నిర్వహించారు. ప్రముఖ ఆడిటర్ కె.లీలాకృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొని, చిన్నారులతో కేక్ కట్ చేయించారు. ఆయన మాట్లాడుతూ, చక్కటి విలువలతో కూడిన విద్యను అందిసున్న ఘంటా కనకదుర్గ, సత్యనారాయణ సేవలు అభినందనీయమన్నారు. అనంతరం చిన్నారులకు కిట్లు పంపిణీ చేశారు.

సమగ్రశిక్షా ఆధ్వర్యంలో ఒకేషనల్ ఇంటర్న్‌షిప్

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): విద్యార్థులు చదువుతూనే వృత్తి విద్యా నైపుణ్యాలు పెంచుకునేందుకు సమగ్ర శిక్షా ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు జిల్లా సమగ్ర శిక్షా అడిషనల్ ప్రాజెక్టు కో–ఆర్డినేటర్ ఎస్.సుభాషిణి తెలిపారు. స్థానిక విద్యా శాఖ కార్యాలయంలో మంగళవారం ఆమె కౌన్సెలర్లతో మాట్లాడుతూ, ఇంటర్న్‌షిప్‌లో భాగంగా ఆటోమోటివ్, బీఎస్ఎఫ్ఐ ట్రేడ్‌కు సంబంధించి కెనరా, యూనియన్ బ్యాంకులు, టీవీఎస్ మోటార్ షోరూమ్‌లు, దివాన్‌చెరువులోని లక్ష్మీగణపతి ఆటోమొబైల్స్‌ను కౌన్సెలర్లు సందర్శించి, అవగాహన చేసుకోవాలన్నారు. అనంతరం జిల్లా విద్యా శాఖాధికారి కె.వాసుదేవరావు కెరీర్ పాథ్ వే పుస్తకాలను వారికి అందజేశారు. కార్యక్రమంలో జిల్లా గర్ల్‌చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ డి.ఎస్తేర్‌రాణి పాల్గొన్నారు.

బంగారు గాజుల చోరీ

కంబాలచెరువు: నగరంలోని కోర్లమ్మపేటలో ఉన్న వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్‌లో బంగారం చోరీ అయిన ఘటనపై మంగళవారం కేసు నమోదైంది. అదే ప్రాంతానికి చెందిన జి.షర్మిల ఉమెన్స్ హాస్టల్ నిర్వహిస్తోంది. తన నాలుగు కాసుల బంగారు గాజులు హాస్టల్‌లోని తన గదిలో పెట్టింది. తర్వాత వాటిని చూసుకుంటే కనిపించలేదు. ఈ మేరకు ఆమె త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

సినిమాలు



శ్యామల	: కిష్కింధపురి
సూర్య మినీ	: బ్యూటీ
సూర్య ప్యాలెస్	: డిమోన్ స్లేయర్
స్వామి	: మిరాయ్
అనుశ్రీ	: బ్యూటీ
శివజ్యోతి	: కిష్కింధపురి, వీరచంద్రహాస
రాజా	: లిటిల్‌హార్ట్స్
ఊర్వశి	: లిటిల్‌హార్ట్స్
మేనక	: టన్నెల్
రంభ	: మిరాయ్
అప్సర	: దక్ష, కొత్తలోక
అశోక	: భద్రకాళీ
నామవరం	
వీఎస్ మహల్	: మిరాయ్
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	: కిష్కింధపురి, మిరాయ్
కడియం	
వెంకటసూర్య	: కిష్కింధపురి

95 కిలోల లడ్డూ సమర్పణ



అమ్మవారికి లడ్డూను సమర్పిస్తున్న భక్తులు

కడియం: మండల కేంద్రమైన కడియంలోని కనకదుర్గ అమ్మవారికి నవరాత్ర ఉత్సవాలను పురస్కరించుకుని 95 కిలోల లడ్డూను ప్రసాదంగా సమర్పించారు. స్థానిక వేంకటభక్తాంజనేయ స్వీట్ స్టాల్ అధినేత నేతి నానాజీ తయారు చేసిన లడ్డూను సొసైటీ త్రీమెన్ కమిటీ అధ్యక్షుడు వెలుగుబంటి రఘురామ్ ఉత్సవ కమిటీకి అందించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య కమిటీ సభ్యులు, దేవీ ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆర్థిక భరోసా ఇవ్వాలి

సీటీఆర్ఐ: బేడ, బుడగ, జంగాల సమస్యలను పరిష్కరించాలని, ఆర్థికంగా వెనుకబడిన తమకు ఆర్థిక భరోసా ఇవ్వాలని బేడ, బుడగ, జంగాల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు వీర్లపల్లి ఏసు అన్నారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ, విద్యారంగంలోనూ, రాజకీయ రంగంలోనూ తమ సామాజిక వర్గాలకు గుర్తింపు లేదన్నారు. ఆర్థికంగా వెనుకబడి ఉండటంతో పిల్లలకు సరైన విద్యను, ఉపాధి అవకాశాలను అందించలేకపోతున్నామన్నారు. దీనిపై ఎంపీ పురందేశ్వరితో పాటు, ఎంపీ బాంసురి స్వరాజ్‌కి కూడా వినతిపత్రం అందించామన్నారు. తమ సమస్యలను పార్లమెంటు సమావేశాల్లో కచ్చితంగా ప్రస్తావిస్తామని హామీ ఇచ్చారన్నారు. సమితి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వీర్నాల కృష్ణ, మహిళా సంఘ సభ్యులు పాల్గొన్నారు.

శ్రీ అన్నపూర్ణా దేవి



అలంకారంలో దర్శనమిస్తున్న అమ్మవారు

వైఎస్సార్ సీపీని బలోపేతం చేయాలి

పార్టీ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాలకృష్ణ



ఫణికుమార్‌ను సత్కరిస్తున్న వేణుగోపాలకృష్ణ, పార్టీ నేతలు



వేణుగోపాలకృష్ణకు కృతజ్ఞతలు తెలుపుతున్న వీరరాఘవరెడ్డి


రాజమహేంద్రవరం రూరల్: వివిధ పదవులు పొందిన వైఎస్సార్ సీపీ నేతలు జిల్లాలోను, తమ నియోజకవర్గాల్లో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ పిలుపునిచ్చారు. పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శిగా నియమితులైన వేమగిరి గ్రామానికి చెందిన విప్పర్తి ఫణికుమార్ మంగళవారం పార్టీ శ్రేణులతో కలిసి భారీ ర్యాలీగా బాణసంచా కాల్పులతో బొమ్మూరులోని పార్టీ కార్యాలయానికి చేరుకున్నారు. అక్కడ వేణుగోపాలకృష్ణను మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఫణికుమార్‌ను వేణు, ఇతర నాయకులు ఘనంగా సత్కరించారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శులు గిరిజాల బాబు, నక్కా శ్రీనగేష్, కడియం మండల అధ్యక్షుడు యాదల సతీష్‌చంద్ర స్టాలిన్, మైనార్టీసెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎంఎం ఆలీ, డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ వెలుగుబంటి అచ్యుతరామ్, జిల్లా అధికార ప్రతినిధి పెయ్యల రాజేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి తాడాల చక్రవర్తి, ఎస్సీ సెల్ రూరల్ నియోజకవర్గ అధ్యక్షుడు చీకురుమిల్లి చిన్న, జిల్లా నేతలు, వేమగిరి గ్రామ నేతలు పాల్గొన్నారు.

వేణుకు వీరరాఘవరెడ్డి కృతజ్ఞతలు

పార్టీ రాష్ట్ర వాణిజ్య విభాగం ప్రధాన కార్యదర్శిగా నియమితులైన పడాల వీరరాఘవరెడ్డి పార్టీ కార్యాలయంలో వేణుగోపాలకృష్ణను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని, పార్టీ పటిష్టతకు శ్రమిస్తానన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు బొప్పన సుబ్బారావు, చీరా రాజు, ఇబ్రహీం బాషా, సుందరపల్లి అనిల్, సిరసుపల్లి శంకరరావు, రాజు, ఆనంద్, మద్దాల అను, కలిశెట్టి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పురస్కారం ఆనందాన్నిచ్చింది

నాదస్వర విద్యాంసుడు మణికంఠకుమార్



శుభలేఖ సుధాకర్ నుంచి పురస్కారాన్ని అందుకుంటున్న మణికంఠకుమార్

సీటీఆర్ఐ: తన ప్రతిభకు పురస్కారం పొందడం ఆనందంగా ఉందని స్థానిక సుబ్బారావునగర్‌కు చెందిన నాదస్వర విద్యాంసుడు తోనంగి మణికంఠకుమార్ అన్నారు. శ్రీవాగ్దేవి విద్యా, నృత్య, స్వర, సప్త, సంగీత సమ్మేళనం కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆయనకు నంది పురస్కారం లభించింది. విజయవాడలో దేవదాయ, ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలోని వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో సినీ నటుడు శుభలేఖ సుధాకర్, ప్రముఖ నాదస్వర విద్వాంసుడు వడ్డాది సత్యనారాయణ నుంచి ఈ పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా మంగళవారం ఇక్కడ తన నివాసంలో మణికంఠకుమార్ మాట్లాడుతూ, 13 ఏళ్లుగా కొన్ని వందల కచేరీలు చేశానని, అనేక పురస్కారాలను అందుకున్నానన్నారు. తాజాగా పురస్కారం అందుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. డోలు విద్వాంసులు యాలూరు శ్రీనివాసులు, ఎలమంద రామచంద్ర, తిరుపతి మునిరత్నం తదితరులు పాల్గొన్నారు.

జెడ్ ధ్రువీకరణ ఉత్పత్తులకు ఆదరణ



సమావేశంలో మాట్లాడుతున్న రామలింగేశ్వర్

రాజమహేంద్రవరం సిటీ: జీరో ఎఫెక్ట్ జీరో డిఫెక్ట్ పథకం ద్వారా ఎంఎస్ఎంఈలు వృథా వ్యయాలను తగ్గించుకుని, ఉత్పాదకతను పెంచుకోవచ్చని కార్పొరేషన్ అదనపు కమిషనర్ పీవీ రామలింగేశ్వర్ తెలిపారు. మంగళవారం నగరపాలకసంస్థ కార్యాలయంలో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమ (ఎంఎస్ఎంఈ)లకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తోడ్పాటుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎంఎస్ఎంఈలను నెలకొల్పిన మొదట్లో ఆర్థికంగా, ఉత్పత్తుల విక్రయాల పరంగా కొన్ని సమస్యలు వస్తుంటాయన్నారు. జీరో ఎఫెక్ట్ జీరో డిఫెక్ట్ పథకంలో నమోదు చేసుకుంటే ఎంఎస్ఎంఈలకు కొంత వరకు భరోసా అందుతుందన్నారు. తద్వారా ఉత్పత్తిలో వేస్ట్‌ని తగ్గించి, నాణ్యతను పెంచుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. పర్యావరణ స్పృహను పెంచుకుని, ఇంధనాన్ని ఆదా చేసుకోవచ్చన్నారు. నాణ్యత, ఉత్పాదకత, లాభాలను పెంచుకుని పర్యావరణంపై తక్కువ ప్రతికూల ప్రభావాన్ని చూపేలా ఈ జెడ్ ధ్రువీకరణ పత్రం ఉపయోగపడుతుందన్నారు. అలాగే మహిళలు నిర్వహిస్తున్న ఎంఎస్ఎంఈలకు ధ్రువీకరణ పత్రంపై వంద శాతం రాయితీ ఉన్నట్లు వెల్లడించారు. అనంతరం కొత్తగా చిన్న తరహా పరిశ్రమలు ప్రారంభించాలనుకునే ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు సబ్సిడీ లోన్లు, ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో సీఎంఎం రామలక్ష్మి, టీఎంసీ సాయికుమార్, ఏపీ స్టేట్ జెడ్ కన్సల్టెంట్ పవన్, అక్షయ ప్రమోటర్స్ ఎండీ జి.మణికంఠ, కమ్యూనిటీ ఆర్గనైజర్లు, పలువురు చిన్నతరహా పరిశ్రమల యజమానులు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్‌లో భాగస్వాములు కావాలి

కంబాలచెరువు: ఎన్ఎస్ఎస్ దినోత్సవం స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ రాష్ట్ర అధికారి డాక్టర్ ఎం.సుధాకర్ ఎన్ఎస్ఎస్ ప్రాముఖ్యాన్ని వివరించారు. కళాశాల ఇంచార్జ్ డాక్టర్ డీవీఎస్ఎన్ మూర్తి మాట్లాడుతూ జాతీయ సేవా విభాగంలో విద్యార్థులంతా భాగస్వాములు కావాలన్నారు. ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ డాక్టర్ బి.మల్లికార్జున కళాశాలలో నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పూర్వ కో–ఆర్డినేటర్ డాక్టర్ జె.యాకోబ్, డాక్టర్ జె.సురేష్, డాక్టర్ ఎ.రాజేశ్వరి, ఎ.అన్నపూర్ణ, షేక్ జరీనా, కె.అనూష తదితరులు పాల్గొన్నారు.

ఆయుర్వేద దినోత్సవం

ఆర్ట్స్ కళాశాల వృక్ష శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ఆయుర్వేద దినోత్సవం నిర్వహించారు. జిల్లా ఆయుష్ అధికారి డాక్టర్ కేసీహెచ్ మహేష్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మానవుడు ఆరోగ్యాన్ని మెరుగుపర్చుకోవడానికి ప్రకృతి నుంచి లభించే సహజ పోషకాలను ఉపయోగించుకోవాలన్నారు. మొక్కల నుంచి లభించే ఆయుర్వేద ఉత్పత్తులు దుష్ప్రభావాలు కలిగించకుండా.. ఆరోగ్యాన్ని, రోగ నిరోధక శక్తిని పెంచుతాయన్నారు.

సచివాలయ సిబ్బంది పాత్ర కీలకం

అదనపు కమిషనర్ రామలింగేశ్వర్



సమావేశంలో మాట్లాడుతున్న రామలింగేశ్వర్

రాజమహేంద్రవరం సిటీ: పీ4 కార్యక్రమం అమలులో వార్డు సచివాలయ ఉద్యోగుల పాత్ర ఎంతో కీలకమని కార్పొరేషన్ అదనపు కమిషనర్ పీవీ రామలింగేశ్వర్ అన్నారు. మంగళవారం స్థానిక వేంకటేశ్వర ఆనం కళాకేంద్రంలో జీరో పావర్టీ లక్ష్యంగా పీ4 విధానం అమలుపై వార్డు సచివాలయ కార్యదర్శులకు మంగళవారం శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 2047 నాటికి విజన్ స్వర్ణాంధ్ర సాధన కోసం నిర్దేశించిన పది లక్ష్యాల్లో భాగంగా పేదరికం లేని సమాజాన్ని నిర్మించేందుకు పీ4 కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్టు చెప్పారు. తద్వారా సమాజంలో ఆర్థిక అసమానతలు తొలగించేందుకు వీలు కలుగుతుందన్నారు. బంగారు కుటుంబాలు, మార్గదర్శులకు సంధానకర్తలుగా సచివాలయ ఉద్యోగులు వ్యవహరిస్తారన్నారు. బంగారు కుటుంబం అవసరాలను, అందుతున్న సాయాన్ని నిరంతరం పర్యవేక్షిస్తుండాలని చెప్పారు. దీనివల్ల ప్రతి ఇంటికి అభివృద్ధి, ప్రతి జీవితానికి ప్రగతి చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఓ కె.ప్రసాద్, సెక్రటరీ జి.శైలజ వల్లి, డిప్యూటీ స్టాటిస్టికల్ ఆఫీసర్ ఏఎస్‌వీ హరికృష్ణ, యంగ్ ప్రొఫెషనల్ కె.దుర్గాభవాని తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత పశు వైద్య శిబిరం

అనపర్తి: జిల్లా పశు సంవర్ధక శాఖ, ప్రాంతీయ గ్రామీణాభివృద్ధి సంస్థ సంయుక్తాధ్వర్యంలో బుధవారం పీరా రామచంద్రపురం గ్రామంలో ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు పశు వైద్యులు డాక్టర్ టి.రామచంద్రారెడ్డి తెలిపారు. ఈ శిబిరంలో పశువులకు చూడి పరీక్షలు, సాధారణ గర్భకోశ వ్యాధులకు, ఎదకు రాని పశువులకు, చూడి నిలబడేందుకు ఉచిత చికిత్సలు అందిస్తారన్నారు. అలాగే మంద గుది ఉన్న పశువులకు ఉచితంగా శస్త్ర చికిత్సలు చేస్తారని, లేగదూడలకు ఏలికపాముల మందులు, ఉచిత రక్త పరీక్షలు నిర్వహిస్తారని వివరించారు. మండపేట, కాకినాడ నుంచి పశు వైద్య శస్త్రచికిత్స నిపుణులు హాజరవుతారన్నారు. పాడి రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి

కోరుకొండ: మామిడి, జీడిమామిడిలో యాజమాన్య పద్ధతుల ద్వారా అధిక దిగుబడి సాధించవచ్చని ఉద్యాన శాఖ మండలాధికారి రినీ అన్నారు. కణుపూరులో మంగళవారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ, చెట్ల కొమ్మల కత్తిరింపు, ఎరువులు అందించడం, పచ్చిరొట్ట విత్తనాలు చల్లడం ద్వారా కలుపు నివారణ తదితర అంశాలను వివరించారు. ఎరువులు వృథా కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సేంద్రియ సాగులో భాగంగా వేపనూనె పిచికారీ చేయడం ద్వారా పురుగులు, తెగుళ్ల నివారణ జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కేవీకే కలవచర్ల విశ్రాంత శాస్త్రవేత్త ఈ.విజయప్రసాద్, టెక్నికల్ అధికారి కార్తిక్ తదితరులు పాల్గొన్నారు.

జగన్మాతా.. పాహిమాం



ఉమామార్కండేయ స్వామి దేవాలయంలో గాయత్రీదేవి అలంకరణ



వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో కుంకుమ చందనం అలంకరణ



మోరంపూడి సాయినగర్‌లో గాయత్రీదేవి అవతారంలో..



బాలాజీపేట సెంటర్‌లో అమ్మవారు

- అమ్మవారికి విశేష అలంకరణలు
- దేవీచౌక్‌లో గాయత్రీ మాతగా అమ్మవారు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): రాజమహేంద్రవరం సిటీ, రూరల్ పరిధిలో మంగళవారం శరన్నవరాత్రుల ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. స్థానిక దేవీచౌక్‌లో గాయత్రీదేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. గోదావరి గట్టున ఉన్న ఉమామార్కండేయ స్వామి దేవాలయంలో స్వయంభూ పార్వతీమాతను గాయత్రీదేవిగా అలంకరించారు. అమ్మవారి ఆలయాల్లో మహిళలు కుంకుమ పూజలు నిర్వహించారు. నగరంలో పలు దేవీ ఆలయాల్లో అమ్మవారు గాయత్రీమాతగా భక్తులకు దర్శనమిచ్చారు. సరస్వతీ పీఠంలో గాయత్రీమాతను దర్శించుకోవడానికి భక్తులు భారీగా తరలివచ్చారు. ఉదయం నుంచి అమ్మవారికి విశేష పూజలు, మహిళలు కుంకుమ పూజలు నిర్వహించారు. దేవీచౌక్‌లో సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా సాయంత్రం శక్తి వేషాలు, రాత్రి భక్త ప్రహ్లాద నాటకం ప్రదర్శించారు.

పూజలందుకున్న దుర్గమ్మ

రాజమహేంద్రవరం రూరల్: శరన్నవరాత్రుల ఉత్సవాలు రెండో రోజు మంగళవారం మోరంపూడి సాయినగర్‌లోని విజయ కనకదుర్గాదేవి ఆలయంలో అమ్మవారిని గాయత్రీదేవిగా అలంకరించారు. బాలాజీపేట సెంటర్‌లోని విజయ కనకదుర్గాదేవి ఆలయంలో అమ్మవారిని గాయత్రీదేవిగా అలంకరించి, కుంకుమ పూజలు నిర్వహించారు. కోటిపల్లి బస్టాండ్ సెంటర్‌లో ఆటోయూనియన్ ఆధ్వర్యంలో విజయ దుర్గాదేవి ఆలయంలో కుంకుమ పూజలు నిర్వహించారు.

8 మంది జూదరుల అరెస్ట్

సీతానగరం: రఘుదేవపురం శివారున పేకాట శిబిరంపై దాడి చేసి, ఎనిమిది మందిని అరెస్ట్ చేశామని ఎస్సై డి.రామ్‌కుమార్ మంగళవారం తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు సిబ్బందితో దాడి చేసినట్టు చెప్పారు. నిందితులను అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.16,300 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. వీరంతా రఘుదేవపురానికి చెందిన వారేనన్నారు. కేసు నమోదు చేసి, నిందితులను కోర్టులో హాజరుపర్చుతామని తెలిపారు.